క్లుప్తంగా

ఉచిత పశు వైద్య శిబిరం



సూరంపేటలో రైతులకు సూచనలు ఇస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు

పిఠాపురం: గొల్లప్రోలు శివారు సూరంపేటలో మంగళవారం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి గాలి కుంటు వ్యాధి నివారణా టీకాలు వేశారు. 50 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ , చూడి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు, పశు వైద్యురాలు హిమజ, ప్రశాంత్, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో రేపు వేద పరిషత్



సామర్లకోటలోని పంచారామ క్షేత్రం

సామర్లకోట: ఏటా నిర్వహిస్తున్న వేద పరిషత్ కార్యక్రమంలో భాగంగా గురువారం పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో 26వ వేద పరిషత్ నిర్వహిస్తున్నట్టు పరిషత్ కన్వీనర్ గ్రంది సత్యరామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పూర్వ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని వేద పండితులతో వేద సభ నిర్వహించి, వారిని సత్కరిస్తామన్నారు. లోక కల్యాణార్థం హిందూ సంస్కృతీ, సంప్రదాయానుసారం చతుర్వేద పారాయణ, వేద స్వస్తి జరుగుతుందని చెప్పారు.

31న కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా జరిగే కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులపై చర్చించడానికి 18 అంశాలతో అజెండా రూపొందించినట్టు చెప్పారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా విభాగాల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.

6న మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఆరున మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. దశాబ్ద కాలంగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్టు జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ మంగళవారం ఇక్కడ తెలిపారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఆరో తేదీ ఉదయం 10 గంటల నుంచి విగ్రహాల పంపిణీ జరుగుతుందని, చెప్పారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

సామర్లకోట: సభ్యత్వాల నమోదు అంశంపై చర్చించేందుకు బీజేపీ కార్యకర్తల సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పార్టీ మండల ఇన్‌చార్జి గొరకపూడి చిన్నయ్యదొర కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నేతలు తుమ్మల పద్మజ, కె గంగరాజు, విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.



ప్రజల్లో అవగాహన పెంచాలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన సంఘటన పునరావృతం కాకుండా, మొదట ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. రాత్రిపూట విధుల్లో ఉండే మహిళా వైద్యుల భద్రతపై పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. మహిళా భద్రతా సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలి.
– డాక్టర్ శ్రావణి, పులిమేరు పీహెచ్‌సీ వైద్యురాలు, పెద్దాపురం మండలం

మహిళా డాక్టర్లకు రక్షణ అవసరం

వృత్తి రీత్యా ఎంతో మంది మహిళా డాక్టర్లు ఒంటరిగానే విధులకు హాజరవుతున్నారు. పని ప్రదేశంలో వారికి రక్షణ అవసరం. కోల్‌కతా ఘటన తర్వాత రాత్రి వేళల్లో ఒంటరిగా విధులకు వెళ్లాలంటే భయమేస్తోంది. అత్యవసర వైద్య సేవలు అందించి, ప్రాణాలు కాపాడే డాక్టర్లపై దాడులు, అత్యాచారాలు, హత్యాయత్నాలు జరగడం బాధాకారం. కోల్‌కతా సంఘటనను అందరూ ముక్తకంఠంతో ఖండించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి.
– శ్వేత, పీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తపల్లి



అప్రమత్తతే ఆయుధం



నాగులపల్లిలో సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ప్రజలకు సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధుల ఆసుపత్రులకు క్యూ కడుతున్న ప్రజలు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

కొత్తపల్లి: ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వాతావరణ మార్పులకు తోడు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో వ్యాధులు, జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్యల రోజురోజుకూ పెరుగుతోంది. మండలంలోని కొత్తపల్లి, నాగులపల్లి, కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు 100కు పైగా ఓపీ నమోదు అవుతోంది. దీంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రజలకు వ్యాధుల నిర్మూలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి...

మండలంలోని కొత్తపల్లి, నాగులపల్లి, కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి కాలానుగుణంగా వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దోమల నివారణ, పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స అంటూ ఏమీ లేదు. లక్షణాలకు అనుగుణంగా చికిత్స అందించాలి. దీంతో వైద్య సిబ్బంది ప్రజలను డెంగీపై అప్రమత్తం చేస్తున్నారు. ఒళ్ళు నొప్పిలు, కళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి



గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అపారిశుద్ధ్యం, కలుషిత నీరు వల్లనే విష జ్వరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రజలు ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి.
– సౌజన్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, నాగులపల్లి

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. ఈ సీజన్‌లో ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గర్భిణులు ప్రభుత్వాస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం.
– రిచాశర్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి, నాగులపల్లి

పరిశుభ్రతపై దృష్టి

పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి శుక్రవారం డ్రైడే–ఫ్రైడే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్ల వద్ద మురికినీరు, నిరుపయోగంగా ఉండే డ్రమ్ములు, రుబ్బురోళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే వ్యాధులను అరికట్టవచ్చు.

ప్రభుత్వ స్కూళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలి



హెచ్‌ఎం నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని చదలాడలో విష జ్వరాల నేపథ్యంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందారన్న వార్తలపై ఎస్‌ఎఫ్‌ఐ నేతల బృందం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా విద్యా శాఖ, వైద్యాధికారులను చదలాడ ఘటనపై ఆరా తీయగా, ఇక్కడ ఒక్క విద్యార్థి మాత్రం డెంగీతో మృతి చెందగా, మిగిలిన వారు వివిధ కారణాలతో మృతి చెందారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాల్లో పూర్తి వాస్తవం లేదన్నారు. దీంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాహిత్, నాయక్ మాట్లాడుతూ ఏదిఏమైనప్పటికీ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల తీవ్రత ఉందన్నారు. విద్యార్థులకు ముందస్తుగా పరీక్షలు నిర్వహించి, అన్ని పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు.

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు

- వివిధ వేషధారణలతో ఎడ్ల బండ్లపై ప్రదర్శన



సామర్లకోటలో వివిధ వేషధారణల్లో ఎడ్ల బండ్లపై నిర్వహిస్తున్న ప్రదర్శన



ప్రత్యేక అలంకరణలో కుంతీమాధవ స్వామివారు

సామర్లకోట: దైవ భక్తితో సేవాగుణం పెరుగుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా మంగళవారం స్థానిక విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న రాధా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్పను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఇలాఉండగా స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి దేవతామూర్తుల వేషధారణలు వేశారు. ఎడ్ల బండ్లపై వివిధ వేషధారణలతో, సాంస్కృతిక ప్రదర్శన, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు నిర్వహించారు. కోలసంబరం, కోలాటం వివిధ వేషధారణలు ఏర్పాటు చేశారు. ఆలయం నుంచి మొదలైన ఊరేగింపు.. మఠం సెంటర్, అయోధ్య రామపురం , కొత్తూరు, ప్రెసిడెంట్‌గారి వీధి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, బళ్ల మార్కెట్ సెంటర్, యార్లగడ్డవారి వీధి, రత్నంరాజు ఆస్పత్రి, వీర్రాఘవపురం మీదుగా ఆలయానికి చేరింది. కౌన్సిలర్ నమ్మి సూర్యదుర్గ, ఆలయ కమిటీ నాయకులు నమ్మి శ్రీనివాసు, దారబాల సూరిబాబు, మార్ల సూర్యనారాయణ, మార్ల రాంబాబు, నమ్మి అప్పారావు భక్తులకు సేవలందించారు.

కుంతీమాధవ స్వామి ఆలయంలో..

పిఠాపురం: పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం పండితులు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీకృష్ణుని జన్మ విశిష్టతను పండితులు వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయంలో ఈ నెల 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఏటా శ్రావణ మాసంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వ్రతాల్లో భాగంగా ఈ నెల 30న ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి వ్రత మహోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

హిందూ ధర్మం విశిష్టమైనది



మహాసభలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఏలేశ్వరం: హిందూధర్మం విశిష్టమైనదని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఒబిలిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. వీహెచ్‌పీని స్థాపించి 60 ఏళ్లు పూర్తి కావడంతో స్థానిక వెంకటేశ్వరా ఫంక్షన్ హాలులో మంగళవారం రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా హిందూమతానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. హిందులంతా ఐక్యంగా ఉండాలన్నారు. సనాతన ధర్మాన్ని హిందూమతమే ఆచరిస్తుందన్నారు. వీహెచ్‌పీ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు చిక్కం సత్యనారాయణ, నడిశెట్టి తిరుపతి రావు, ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



విశ్రాంతి ఉద్యోగి రాజును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. కొత్తపల్లికి చెందిన గణేశుల రాజు విశాఖ జిల్లాలోని పోలీసు శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. ఈ సందర్భంగా మంగళవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. రాజును స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సానా సత్యనారాయణ, గవర రాజు, కొండమూరి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- ఆర్డీఓ జేఎస్ రామారావు



పెద్దాపురం ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ఇసుక రీచ్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ జె.సీతారామారావు హెచ్చరించారు. స్థానిక ఏడీబీ రహదారిలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుక నిల్వల వివరాలు, పంపిణీ ఎలా జరుగుతోంది, రవాణా చార్జీలు తదితర విషయాలపై ఆరా తీశారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇసుక నిల్వల్లో తేడా వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆర్డీఓ స్పష్టం చేశారు. ఆయన వెంట డీటీ కాంతారావు, సిబ్బంది ఉన్నారు.

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్సైలు

సామర్లకోట: ప్రయాణ సమయాల్లో రైల్వే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్ రామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజులు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక రైల్వే ప్లాట్‌ఫారంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని చెప్పారు. నేరగాళ్లను దృష్టిలో ఉంచుకుని బ్యాగ్‌లు, వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ప్రయాణికుల వద్దకు వచ్చి రూపాయి నోట్లు పడిపోయాయని చూపించి, ప్రయాణికులు ఆ నోటును తీసుకునే లోగా బ్యాగ్‌లను మాయం చేస్తున్నారని హెచ్చరించారు. అదేవిధంగా అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండరాలను తీసుకోరాదని సూచించారు. విలువైన నగలు వెంట తీసుకు వెళ్లే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తోటి ప్రయాణికులపై ఏ మాత్రం అనుమానం ఉన్నా 100కు కాల్ చేయాలని కోరారు.

వికసిత్ ఏపీ దిశగా అడుగులు

- మెప్మా పీడీ ప్రియంవద



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ప్రియంవద

కాకినాడ: వికసిత్ ఏపీ–2047ను లక్ష్యసాధన దిశగా క్షేత్ర స్థాయిలో సిబ్బంది పని చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మెప్మా సిబ్బందితో ఈ అంశంపై ఆమె సమావేశమయ్యారు. వికసిత్ ఏపీ–2047 ప్రణాళికపై సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో ప్రతిపాదించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ, ఆయా పథకాల అమలుపై సూచనలు ఇచ్చారు. సైబర్ నేరాలు, వాటి నుంచి బయటపడే మార్గాలపై పోలీసు విభాగాల ప్రతినిధి శ్రీకృష్ణ వివరించారు. ఆయా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మూగజీవాలకు గాలికుంటు ముప్పు

- పశువుల్లో వ్యాప్తి చెందుతున్న ప్రాణాంతక వ్యాధి
- ఆందోళన చేందుతున్న పాడి రైతులు
- వ్యాధి నివారణకు జోరుగా వ్యాక్సినేషన్



ఎ.మల్లవరంలో పాడి పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

ప్రత్తిపాడు/రౌతులపూడి: వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు తొందరగా వ్యాపిస్తాయి. ఈ సీజన్ వచ్చిందంటే చాలు ప్రాణాంతకమైన గాలికుంటు వ్యాధి పశువుల్లో వ్యాప్తి చెందుతుంది. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు వంటి చీలు గిట్టలుండే జంతువుల్లో సంభవించే తీవ్రమైన వైరల్ అంటువ్యాధి ఇది. గాలికుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. గాలికుంటు వ్యాధిని కలుగ చేసే వైరస్ గాలి ద్వారా వ్యాపించి పశువులకు వ్యాధి సోకేందుకు దోహదపడుతోంది.

నియోజకవర్గంలో పశువుల వివరాలు

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 40,492 గేదెలు, 11,443 ఆవులు వెరసి 51,935 పశువులు ఉన్నాయి. గేదెలు, ఆవుల్లో ఈ వ్యాధి నివారణకు పశు సంవర్ధకశాఖ ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18 వరకు ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టింది. వ్యాధి సోకిందని అనుమానం వచ్చిన వెంటనే దగ్గరలోని పశు వైద్యాధికారితో పరీక్షలు చేయించాలని పశు వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి సోకిన పశువులో ఉత్పాదక, రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో పశువు మరణానికి గురయ్యే ప్రమాదం ఉంది.

వ్యాధి లక్షణాలు...

- వ్యాధి సోకిన పశువుల్లో 104 డిగ్రీల జ్వరం ఉంటుంది.
- నోటిలో, పొదుగుపై, గిట్టల మధ్య, నాలుకపై బొబ్బలు ఏర్పడతాయి. అలా వచ్చిన బొబ్బలు 24 గంటల్లో చితికిపోతుంటాయి.
- చితికిన బొబ్బల వలన పుండ్లు ఏర్పడతాయి. పుండ్లపై బ్యాక్టీరియా వ్యాపించడంతో చీము పడుతుంది.
- కాళ్లు మీద పుండ్లు, బొబ్బల మూలంగా కుంటుకుంటూ నడుస్తుంటాయి.
- పొదుగు వాపునకు గురవుతుంది. వ్యాధి సోకిన పొదుగు నుంచి వచ్చిన పాలు తాగిన దూడలు మరణానికి గురయ్యే ప్రమాదం ఉంది.
- వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి కూడా తగ్గుతుంది.
- సూడి పశువుల్లో గర్భకోశ వ్యాధులు వచ్చే ప్రమాదముంది.

వ్యాధి వ్యాప్తి ఇలా....

- ఈ వ్యాధి కారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది.
- వ్యాధిపీడిత పశువులను ఒకచోటి నుంచి మరొక చోటికి రవాణా చేయటం వల్ల కూడా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.
- దేశవాళీ పశువుల కన్నా సంకరజాతి పశువులు త్వరగా ఈ వ్యాధిబారిన పడతాయి.
- లేగ దూడలకు ఈ వ్యాధి సోకితే త్వరగా మరణిస్తాయి.

నివారణ ఇలా...

పశువుకు నాలుగు నెలలు పైబడిన వయస్సులో వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలి. దీని వలన వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. తరువాత ఏటా ఈ టీకాలను క్రమం తప్పకుడా వేయిస్తుండాలి. ఏడాదిలో ఒక్కసారి టీకా వేయిస్తే ఏడాది మొత్తం వ్యాధి రాకుండా కాపాడుతుంది. ఈ వ్యాధి అన్ని సీజన్లలో వచ్చే ప్రమాదముంది. చూడి గేదెలకు ఈనిన తర్వాత టీకాలు వేయించడం ఎంతో మంచిది.


చికిత్స విధానం

గాలి కుంటు వ్యాధికి అందించే చికిత్స విధానాన్ని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ వివరించారు. వ్యాధి సోకిన పశువును తోటి పశువుల్లో కాకుండా వేరుగా ఉంచాలి. వ్యాధి ద్వారా వచ్చిన పుండ్లపై పోటాషియం పర్మాంగనేట్ కలిపిన నీటితో గాయాలను శుభ్రంగా కడగాలి. నోటి పుండ్లకు బోరో గ్లిజరిన్, కాలిపుండ్లకు బోరిక్ యాసిడ్, హిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్లు పూయాలి. పుండ్లపై ఈగలు వాలకుండా వేపనూనే పూయాలి. బొబ్బలు సోకిన పశువులకు తగిన సంరక్షణ లేకపోతే మరణించే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన పశువులు మేత సరిగ్గా మేయలేవు అందుకని వాటికి ప్రత్యేకంగా సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని అందించాలి. జొన్న అన్నంలో కొద్దిగా బెల్లం, ఉప్పు కలిపి జావగా తయారుచేసి ప్రతిరోజూ పశువుకు ఇవ్వాలి.

నియోజకవర్గంలో ఆవులు, గేదెల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	మొత్తం
ప్రత్తిపాడు	2,935	11,372	14,307
ఏలేశ్వరం	2,440	9,302	11742
శంఖవరం	3,278	8,130	11,408
రౌతులపూడి	2,790	11,688	14,478
మొత్తం	11,443	40,492	51,935

వచ్చే నెల 18 వరకూ వ్యాక్సినేషన్



జాతీయ పశు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఆవులు, గేదెలకు వచ్చే నెల 18 వరకు టీకాలు వేస్తాం. కాకినాడ జిల్లాకు 3.15 లక్షల టీకాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న ఆవులు, గేదెలకు పశువైద్య సిబ్బంది టీకాలు వేస్తారు. పశు పోషకులు వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించి తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలి. రైతులు తమకు దగ్గరలోని రైతు సేవాకేంద్రం, పశువైద్య సహాయకులు, పశువైద్యశాల, పశు వైద్యాధికారులను సంప్రదించాలి.
– చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, ప్రత్తిపాడు